విడిగా మేపాలి. కుక్కలు పశువులు తరమకుండా చూసుకోవాలి. ఈనమోపుకు వచ్చినపుడు ఆడమేక మేత మేయదు. పొదుగు చేస్తుంది. కరివి ఉబ్బుతుంది. సాధారణముగా మేకలు ఏ ఇబ్బంది లేకుండానే ఈనుతాయి. ఉచ్చ, బుడ్డ, ఉమ్మి నీరు వేసిన అరగంట తర్వాత ఈనకపోతే పశువైద్యుని సంప్రదించాలి. అందుబాటులో లేకపోతే వేలు పెట్టి పిల్ల పొజిషన్ చూసుకోవాలి. మావి వేసే వరకూ కనిపెట్టాలి. వేయకపోతే లాగకూడదు. మందులు వాడాలి.

## మేక పోతు యాజమాన్యం

ఒక సంవత్సరము వయస్సు వచ్చిన తర్వాత ఆడ మేకలపై దాటడానికి వదలాలి. ఒకపోతు సంవత్సరంలో 160 వరకూ ఆడ మేకలను దాటును. రోజుకు అర కేజీ దాణాను ఇవ్వవచ్చును. పోతును ప్రతీ 2 సంవత్సరములకు మార్చాలి.

## మగ మేక పిల్లలకు విత్తులు నొక్కుట

పునరుత్పత్తికి ఉపయోగపడని మగ మేకపిల్లలకు 3 నెలల వయస్సులో విత్తులు నొక్కడం మంచిది. దాని వలన వాటి బరువు పెరుగుతుంది. న్యూసెన్స్ ఉండదు. విత్తులు నొక్కే పరికరం ప్రతీ పశువుల హాస్పటల్‌లోనూ ఉంటుంది.

## మేక పునరుత్పత్తి

యుక్త వయస్సు వచ్చిన ఆడ మేకలు ప్రతీ 21 రోజులకు ఒకసారి ఎదకు వస్తాయి. ఎద 2-3 రోజులు (18-24) ఉంటుంది. ఎదలో ఉన్న మేక తోక పైకి ఎత్తుతుంది. మిగిలిన మేకలు రుద్దుకొన్నపుడు తోక ఆ ప్రక్కకూ, ఈ ప్రక్కకూ కదుల్చును. కరివి నుండి తీగ వేస్తుంది. కరివి వాస్తుంది. కరివి విప్పారి లోపలి ఎర్రగా కనిపించును. నీరుడు ఎక్కువసార్లు పోస్తుంది. తరచు అరుస్తుంది.

మేకల ఖరీదు ఎక్కువగా ఉన్న ఈ రోజుల్లో మేక పిల్లలను బ్రతికించుకోవడం ఎంతో ముఖ్యము. మేక పిల్లలు బ్రతకాలంటే దాణా పెట్టాలి. పచ్చిమేత పెట్టాలి. మేకపిల్ల వయసు 8 రోజులు నుండి పచ్చిమేత పెట్టాలి. అదే విధముగా స్టార్టర్ దాణాను కూడా ఇవ్వాలి.

**స్టార్టర్ (ప్రారంభ) దాణా పాళ్ళు:**

మొక్కజొన్న - 60 ; తెలగపిండి - 20 ; చేప పొడి - 10 ; తవుడు - 10 ; మినరల్ మిక్చర్ + ఉప్పు - 2% ; (లేదా) పప్పుధాన్యము- 20% ; మొక్కజొన్న - 22% ; తెలగపిండి - 35% ; తవుడు - 20% ; మినరల్ మిక్చర్ - 2% ; ఉప్పు - 1% ;

## ఆరోగ్య పరిరక్షణకు సూత్రములు

1. జబ్బు చేసిన మేకలను వేరు చేయాలి.
2. షెడ్డులో మేకలు సాంద్రత ఎక్కువ ఉండకూడదు.
3. మలము, మూత్రములు జబ్బులు వచ్చేందుకు దోహదం చేస్తాయని గ్రహించాలి.
4. గొమార్లు, పేలు మొదలైన పరాన్న జీవులని ఎప్పటికప్పుడు నివారించాలి.
5. షెడ్డును పరిశుభ్రముగా ఉంచాలి.
6. పాముల (నట్టలు) మందులు, జలగ మందులు, టీకాలను క్రమము తప్పకుండా వేయించాలి.
7. రికార్డులు వ్రాసుకోవాలి. పుట్టిన తేది, చూలు కట్టిన తేది వంటి ముఖ్యమైన తారీఖులను పుస్తకంలో వ్రాసుకోవాలి.
8. ఎల్లప్పుడు పశువైద్యుని సలహాలను పాటించాలి.

## మేక పిల్లల ఆరోగ్య పరిరక్షణ


మేక పిల్లలలో మొదటి ఆరోగ్య సమస్య తెల్లపారుడు పాలు ఎక్కువైనా లేదా ఏదైనా ఇన్‌ఫెక్షన్ వలననైనా రావచ్చును. పాలను తక్కువగా వదలాలి. సిప్రోఫ్లాక్సోసిన్ + టినిడజాల్ బిళ్ళలను వాడాలి. ఏలికపాముల నివారణకు ఫెన్‌బెండాజోల్ వాడాలి.

## మేకల మంద ఆరోగ్య పరిరక్షణ

కాలాన్ని బట్టి మేకలకు ఏలికపాముల మందు, జలగ మందులను ఇవ్వాలి. వీటితో పాటు కాల్షియం ఇతర లవణాలు అందించాలి. దీనికిగాను మినరల్ మిక్చర్‌ను విధిగా ప్రతీ మేకకు అందించాలి. మినరల్ మిక్చర్‌ను షెడ్లలో వ్రేలాడదీయాలి.

డా॥ వి.ఎస్.జి.ఆర్. నాయుడు, ప్రోగ్రాం కో ఆర్డినేటరు, కె.వి.కె.
డా॥ బి.జాన్‌బాబు, ముఖ్య సాంకేతిక అధికారి (పశువిజ్ఞానం)
డా॥ పి.వి.వి.యస్.శివరావు, సహాయ ముఖ్య సాంకేతిక అధికారి (పశువిజ్ఞానం)

# పొట్టి మేకల పెంపకము



కృషి విజ్ఞాన కేంద్రము
కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థ
(భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి)
కలవచర్ల, రాజానగరం మండలం - 533297
తూర్పు గోదావరి జిల్లా
2015

## మేకల వలన లాభాలు

1. మేకలను విచ్చలవిడిగా మాంసానికి వధిస్తున్నప్పటికీ వీటి సంఖ్య పెరుగుచున్నది. అంటే వాటికి పునరుత్పత్తి సామర్థ్యం ఎక్కువ.
2. గొర్రెలు ఒక ఈతలో ఒక పిల్లను పెడతాయి. అయితే మేకలు 2 పిల్లలను పెడతాయి. కాబట్టి వీటి సంతానం తొందరలోనే ఎక్కువవుతుంది.
3. మేకలలో ఈతకు ఈతకు ఎడము తక్కువగా ఉంటుంది.
4. ఇంచు మించు అన్ని రకాల వాతావరణానికి అలవాటుపడి బ్రతకగలవు.
5. యాజమాన్యానికి అయ్యే ఖర్చు తక్కువ. తక్కువ స్థాయి గృహవసతి సరిపోతుంది.
6. మహిళలు, చిన్నపిల్లలు కూడా సాకవచ్చును.
7. అన్ని రకాల పశుగ్రాసాలను తింటాయి. ఇంచుమించు అన్ని రకాల చెట్ల ఆకులను తింటాయి.
8. గొర్రెలు, ఆవులు, గేదెలు మేయలేని /అందని నేల గడ్డిని తినగలవు.
9. కొండవాలు, గుట్టల మధ్యన కూడా ఎగబ్రాకి గడ్డిని తింటాయి.
10. అధిక పీచు పదార్థము గల పశుగ్రాసాలను కూడా తిని జీర్ణించుకోగలవు.
11. తక్కువ ఆహారముతో ఎక్కువ పాలను, మాంసాన్ని ఉత్పత్తి చేస్తాయి. నేలను అంటుకొని ఉన్న, మేతను, ఇతర పశువులు తినలేని పశుగ్రాసాన్ని మేకలు తింటాయి.
12. మేకలు మాంసాన్నే కాకుండా శ్రేష్ఠమైన ఆరోగ్యకరమైన పాలను ఇస్తాయి. మేకల ఖరీదు తక్కువ యాజమాన్యం తేలిక కాబట్టి మేకలను "పేదలపాలిట ఆవు"గా అభివర్ణిస్తారు.
13. మేక మాంసములో కొలెస్ట్రాల్ శాతము తక్కువ. మేక పాలలో వెన్న శాతం తక్కువ కాబట్టి ఈ పాలు మనుష్యులకు ఆరోగ్యదాయకం.

## పొట్టి మేకలు - విశిష్టత
### (BLACK BENGAL GOATS)

1. ఇవి పశ్చిమ బెంగాల్, అస్సాం రాష్ట్రాలలో ఎక్కువగా కనిపిస్తాయి.
2. వీటి మాంసము నాణ్యతలో అత్యుత్తమము.
3. వీటి చర్మానికి, మాంసానికి మంచి గిరాకీ ఉన్నది. ఇవి ఎక్కువగా నలుపు రంగులో ఉంటాయి. కొన్ని పూర్తి తెలుపు రంగులోను, నలుపు, తెలుపు మచ్చలతో ఉంటాయి.
4. మేకలలో అధిక సంతానోత్పత్తి చేసే జాతులలో ఈ పొట్టి మేకలదే ప్రథమ స్థానము.
5. సంవత్సరములో 2 సార్లు ఈనుతాయి. ఒక్కొక్క ఈతకు 2పిల్లలను, 3 పిల్లలను అరుదుగా 4 పిల్లలను కూడా పెడతాయి.
6. ఇవి ఎక్కువ పాలను ఉత్పత్తి చేయడము వలన పిల్లలకు సరిపోతాయి. కాబట్టే నూటికి 90 శాతం పిల్లలు బ్రతుకుతాయి.
7. ఇవి పొట్టిగా ఉన్నప్పటికీ మేకపోతులు 19-32 కేజీల బరువు పెరుగుతాయి. ఆడ మేకలు 13-22 కేజీలు తూగుతాయి.
8. ఈనిన నెలలోపే ఆడమేకలు ఎదకు వస్తాయి. ఎద లక్షణాలు ప్రస్ఫుటంగా కనిపిస్తాయి. ఆడ మేకలలో కోరిక బలముగా ఉండి మగ మేకల వంటిపై రాస్తాయి. వృషణాలను నోటితో రాస్తాయి. ఈ జాతి విశిష్టతకు ఎద, పునరుత్పత్తి సామర్థ్యమే కారణము. ఎద 2-3 రోజుల వరకూ ఉంటుంది. చూడి కాలము 145-155 రోజులు.
9. ఇవి పొట్టిగా ఉండడము వలన అటవీ శాఖ కూడా అడవుల్లో మేయడానికి అనుమతిని ఇచ్చారు.

## మేక పిల్లల పోషణ

తల్లి మేక చూలితో ఉన్నప్పడే దాణా, పచ్చిమేత మినరల్ మిక్చర్‌ను ఇస్తే మేకపిల్లలు ఆరోగ్యముగా పుడతాయి. ఈనిన వెంటనే ముక్కులను పిండాలి. దీని వలన జిగట (మ్యూకస్) బయటకు వచ్చి శ్వాస తీసుకోవడం సులువు అవుతుంది. అదే విధముగా శరీరము మీద ఉన్న జిగటకు వరిగడ్డితో తుడవాలి. బొడ్డు మీద ఖచ్చితముగా అయోడిన్ (టింక్చర్)ను రాయాలి. పుట్టిన 15 నిముషాల లోపుగానే ముర్రిపాలకు(జున్ను పాలు) వదలాలి. దీని వలన పిల్లలలో రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. ముర్రిపాలు త్రాగిన పిల్లలు ఆరోగ్యముగా పెరుగుతాయి. తల్లికి సరైన పోషణ లేకపోతే పిల్లలు 'పీల'గా పుడతాయి. ఇవి బ్రతకడం కష్టం. అయితే శ్రద్ధగా పాలను పట్టిస్తే వీటిని కూడా బ్రతికించుకోవచ్చును.

పిల్లలను 3-5 రోజుల వరకూ తల్లితోనే ఉంచాలి. మందలోని మేకలు ముఖ్యముగా రాత్రులు పిల్లలను తొక్కకుండా తల్లి పిల్లలను వేరేచోట ఉంచాలి. పిల్లలకు పాలు చాలకపోతే ఆవుపాలను వేడిచేసి చల్లార్చి సీసాతో పాలపీక సహాయంతో పాలు పట్టించాలి. గ్లాసుతో పట్టించకూడదు. గ్లాసుతో పట్టిస్తే ఊపిరితిత్తులలోనికి వెళ్ళి చనిపోతాయి.

నాలుగవ వారములో పిల్లలకు పాముల మందులు ఇవ్వాలి. పిల్లలు ఎక్కువ శాతము వర్షాకాలములోనూ శీతాకాలములోనూ మరణిస్తాయి. మరణాలు తగ్గించాలంటే చెక్కలతో పరంజ నిర్మించి వాటిపై మేకలను, పిల్లలను ఉంచితే చెక్కల సందులలో నుండి నీరుడు పెంటికలు క్రింద పడిపోవడము వలన పరంజ పొడిగా ఉంటుంది.



## చూడి మేక పోషణ

మొదటిగా చాలినంత పచ్చిమేతను ఇవ్వాలి. సమీకృత దాణాను రోజుకు 500 గ్రాముల వరకూ ఇవ్వవచ్చును. మినరల్ మిక్చర్‌ను తప్పనిసరిగా ఇవ్వాలి. మగ మేకలను